# పాన్‌కార్డు అప్‌డేట్ పేరిట మోసం

- పంచాయతీ కార్యదర్శి ఖాతాలో రూ.21వేలు ఖాళీ
- రాజోళి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

రాజోళి, జనవరి 24 : పాన్‌కార్డు అప్‌డేట్‌తో వచ్చిన మెసేజ్ లింక్‌ను నొక్కడంతో రూ.21 వేలు అకౌంట్ నుంచి మాయమైన ఘటన మండలంలోని తుమ్మిళ్లలో చోటు చేసుకున్నది. రాజోళి ఎస్సై అబ్దుల్‌ఖాదర్ కథనం ప్రకారం.. మండలంలోని తుమ్మిళ్ల గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి ఉండవల్లి మండలం బొంకూరులో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ పాన్‌కార్డు అప్‌డేట్ పేరుతో అధికారిక వాట్సాప్ (ఎంపీడీవో) గ్రూప్‌లో మెసేజ్ రావడంతో దాన్ని క్లిక్ చేయగా అందులో అడుగుతున్న ఓటీపీలను ఎంటర్ చేశాడు. దీంతో తన అకౌంట్‌లో ఉన్న రూ.21వేలు ఖాళీ అయినట్లు గుర్తించి ఆన్‌లైన్‌లో మోసపోయానని తెలుసుకొని సైబర్ క్రైం పోర్టల్ 1930కు డయల్ చేసి సమాచారం అందించాడు. అనంతరం రాజోళి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

# ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు

- ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

ఇటిక్యాల, జనవరి 24 : మండలంలోని గోపల్‌దిన్నె ప్రాథమిక పాఠశాల అదనపు గదిని బుధవారం ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నదని, అందులో భాగంగానే రూ.9.50 లక్షలతో అదనపు గదిని నిర్మించినట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరిగా రావడం లేదని గ్రామస్తులు వారి దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ హన్మంత్‌రెడ్డి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి, అలంపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మర్ రాందేవ్‌రెడ్డి, సర్పంచులు గోవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుందర్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, సర్వారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

***పనుల్లో నాణ్యత ఉండాలి..***

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 24 : వంతెన పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే విజయుడు సూచించారు. షేక్‌పల్లి గ్రామంలో రూ.1.75 కోట్లతో నిర్మించనున్న కల్వర్టుకు బుధవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హనుమంతు, డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, సర్పంచ్ రవీందర్, నాయకులు సుదర్శన్‌రెడ్డి, సుందర్‌రాజు, ప్రవీణ్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ ధరలు పెంచాలి



వేరుశనగకు మద్దతు ధర ఇవ్వాలి. వారం రోజుల వరకు రూ.8 వేలకు పైగా ధరలు ఉన్న వేరుశనగకు ఒక్కసారిగా ధరలు తగ్గించారు. ధరలు తగ్గడంతో మాకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. రేయనక పగలనక పొలాల వద్ద కాపుగాసి పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు రాకుంటే అప్పులపాలు కావాల్సిందే. అందుకే వేరుశనగకు రూ.8వేలకు పైగా మద్దతు ధర కల్పించాలి. నేను బుధవారం మార్కెట్‌కు 250 బస్తాల వేరుశనగ తీసుకొచ్చి రెండు కుప్పలు పోశాను. అందులో ఒక కుప్పకు క్వింటా రూ.6,800 రాగా మరో కుప్పకు రూ.6,300 వచ్చింది. ఒకే రైతుకు చెందిన వేరుశనగకు రెండు ధరలు రావడం ఏంటి? వ్యాపారులు కావాలనే ధరలు తగ్గించి టెండర్లు వేస్తున్నారు.

*- లక్ష్మణ్‌నాయక్, రైతు, కొడంగల్*

## రీ టెండర్ వేస్తాం..



వేరుశనగకు ధరలు తగ్గాయని రైతులు ఆందోళన చేశారు. వేరుశనగకు ధరలు పెంచి ఇవ్వాలని రైతులు కోరగా వ్యాపారులతో ధరల విషయంలో మాట్లాడాం. వారు రూ.5వేలలోపు టెండర్ వేసిన వాటికి క్వింటాకు రూ. 200 పెంచుతామని చెప్పారు. అందుకు రైతులు అంగీకరించకపోవడంతో గురువారం రీ టెండర్ వేయడానికి నిర్ణయించాం. జడ్చర్లతోపాటు ఇతర మార్కెట్‌లో కూడా ఇవే ధరలు ఉన్నాయి. రైతులు వేరుశనగను నాణ్యతగా తీసుకొస్తే మంచి ధరలు వస్తాయి. కానీ చాలామంది మట్టి, తేమ ఉన్నవాటిని తీసుకురావడంతో ధరలు తగ్గుతున్నాయి. బాగా ఆరబెట్టి చెత్తాచెదారం లేకుండా తీసుకువస్తే మంచి ధరలు లభిస్తాయి.

*- శ్రీనివాస్, మార్కెట్ కార్యదర్శి, బాదేపల్లి వ్యవసాయ మార్కెట్*



బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

# రైతన్న కడుపుమంట

- వేరుశనగ పంటకు మద్దతు ధర కోసం ధర్నా
- రెండ్రోజుల్లో రూ.2 వేలు తగ్గించడంపై ఆగ్రహం
- బాదేపల్లి మార్కెట్ కార్యాలయం ముట్టడి
- వ్యాపారులతో సమావేశమైన అధికారులు
- రీటెండర్ వేసేందుకు ట్రేడర్ల అంగీకారం
- మార్కెట్‌లో రాత్రంతా రైతుల పడిగాపులు

జడ్చర్ల, జనవరి 24 : వేరుశనగకు గిట్టుబాటు ధరలు రావడం లేదంటూ బుధవారం జడ్చర్లలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆందోళనకు దిగారు. వారం రోజుల వరకు వేరుశనగకు క్వింటా రూ.8,500పైగా ధర పలుకగా రెండు, మూడు రోజులుగా ధరలు తగ్గిస్తూ రూ.4 నుంచి రూ.6వేల వరకు వేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. వేరుశనగకు మద్దతు ధర కల్పించి న్యాయం చేసేవరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదని, క్వింటాకు రూ.8,500 ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ధరలు తగ్గించడం ఏంటని ప్రశ్నించారు. వ్యాపారులు, దళారులు కలిసి ధరలు తగ్గించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వేరుశనగకు ధరలు తగ్గడంతో పెట్టుబడి కూడా రావడం లేదని, మీరిచ్చే రేటుకు వేరుశనగను అమ్ముకుంటే మేమంతా అప్పులపాలు కావాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆందోళన చేస్తున్నారనే విషయం తెలుసుకున్న తాసీల్దార్ సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ధరలు పెంచే వరకు ఆందోళన విరమించేది లేదని వారు తేల్చి చెప్పడంతో అధికారులు వ్యాపారులతో సమావేశం నిర్వహించి ధరలు పెంచాలని సూచించారు. వేరుశనగ సరుకులో మట్టితోపాటు తేమగా ఉందని అందు చేతనే ధరలు తగ్గాయని, అదేవిధంగా ఎక్స్‌పోర్టులో కూడా ధరలు తగ్గడం వల్ల ఇలా జరిగిందని వ్యాపారులు చెప్పారు. అయితే అధికారుల సూచన మేరకు రూ.5వేల లోపు ధరలు వచ్చిన వారికి క్వింటాకు రూ.200 అధికంగా ఇస్తామని తెలుపగా అందుకు రైతులు అంగీకరించలేదు. మార్కెట్‌కు వచ్చిన ప్రతి రైతుకూ ధర పెంచి ఇవ్వాలని వారు పట్టుబట్టారు. దాంతో అధికారులు వ్యాపారులతో మాట్లాడి గురువారం రీ టెండర్ వేయడానికి నిర్ణయించారు. దానికి రైతులు కూడా ఒప్పుకోవడంతో గురువారం వేరుశనగకు రీ టెండర్ వేస్తారని తాసీల్దార్ సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. అయితే బుధవారం మార్కెట్‌కు దాదాపు 20 వేల బస్తాల (589 క్వింటాళ్లు) వేరుశనగ అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌కు జడ్చర్ల చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు అధిక శాతం కోస్గి, కొడంగల్, మద్దూర్, కర్ణాటక ప్రాంతాలకు చెందిన రైతులు వేరుశనగను తీసుకొచ్చారు. జడ్చర్లలో మంచి ధరలు వస్తాయని, తూకాల్లో కూడా మోసాలు లేవనే ఇంతదూరం వచ్చి వేరుశనగను అమ్ముకుంటున్నామన్నారు. కానీ ఇక్కడికి వచ్చాక ధరలు తగ్గించడంతో రవాణా చార్జీలతోపాటు సాగు ఖర్చులు అధికం కావడంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్వింటాకు రూ.8,500 ఇస్తే గిట్టుబాటవుతుందని వారు పేర్కొన్నారు. దాదాపు రెండు గంటలకు పైగా రైతులు ఆందోళన నిర్వహించారు.





రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న అధికారులు, బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం రాత్రి వేరుశనగ కుప్పల వద్దే రైతుల పడిగాపులు

# జోరుగా క్రయవిక్రయాలు

- కందులు క్వింటా @ రూ.10,559, వేరుశనగ @ రూ.7,155 ధర

జడ్చర్ల, జనవరి 24 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. బుధవారం మార్కెట్‌కు 5,089 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.7,155, కనిష్ఠంగా రూ.4,169, మధ్యస్తంగా రూ. 6,484 పలికింది. 103 క్వింటాళ్ల కందులు రాగా గరిష్ఠంగా రూ.9,679, కనిష్ఠంగా రూ.9,159, 33 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ ధాన్యం రాగా గరిష్ఠంగా రూ.3,019, కనిష్ఠంగా రూ. 2,222 ధర వచ్చింది. 169 క్వింటాళ్ల పత్తి రాగా గరిష్ఠంగా రూ.6,709.., బెబ్బర్లు క్వింటాకు రూ. 6000, మొక్కజొన్న క్వింటాకు రూ.2,312 ధర లభించినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

***నారాయణపేట మార్కెట్‌లో..***

నారాయణపేట టౌన్, జనవరి 24 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 49 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా గరిష్ఠంగా రూ. 10,559, కనిష్ఠంగా రూ.9,870 ధర పలికింది. 380 క్వింటాళ్ల ఎర్రకందులు రాగా గరిష్ఠంగా రూ.10,420, కనిష్ఠంగా రూ.8,629.., 32 క్వింటాళ్ల సోనాధాన్యం రాగా గరిష్ఠంగా రూ. 3,059, కనిష్ఠంగా రూ.2,989, 18 క్వింటాళ్ల హంసరకం ధాన్యం రాగా గరిష్ఠంగా రూ.1,960 ధర లభించింది. 1,429 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి రాగా గరిష్ఠంగా రూ. 6,969, కనిష్ఠంగా 3,800 ధర పలికినట్లు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.



క్రషర్ ఎన్‌వోసీని రద్దు చేయాలని తాసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ, రైతులు

# ఎంపీటీసీ సంతకం ఫోర్జరీ

- తాసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసిన చౌడూర్ ఎంపీటీసీ
- క్రషర్ పనులు ఆపాలని రైతుల వేడుకోలు

నవాబ్‌పేట, జనవరి 24 : మండలంలోని చౌడూర్ గ్రామ శివారులో ఇటీవల ప్రారంభించిన క్రషర్ మిషన్ పనులకు అనుమతి కోసం ఎన్‌వోసీ తీసుకునేందుకు ఏకంగా తన సంతకాన్నే ఫోర్జరీ చేశారని చౌడూర్ ఎంపీటీసీ గోపీకృష్ణ ఆరోపించారు. చౌడూర్ క్రషర్ మిషన్ పనులను వెంటనే నిలిపివేయాలంటూ ఎంపీటీసీ గోపీకృష్ణతోపాటు చుట్టుపక్కల రైతులు బుధవారం తాసీల్దార్ మల్లికార్జునరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగానే క్రషర్ ఏర్పాటుతో ఏర్పడుతున్న నష్టాన్ని, అనర్థాలను వారు తాసీల్దార్‌కు వివరించారు. మూడు నెలల కిందట అక్కడ క్రషర్ ఏర్పాటు కోసం అక్కడి వ్యాపారి శివారెడ్డి ఎన్‌వోసీ సర్టిఫికెట్ కోసం అక్కడి రైతులను మోసం చేసి చౌడూర్ గ్రామానికి చెందిన ముగ్గురు సాక్షుల సంతకాలు తీసుకున్నారని తెలిపారు. ఇందులో ఆర్ఐ కిరణ్‌కుమార్ వ్యాపారికి సహకరించి రైతులను మోసం చేయడంలో కీలకపాత్ర పోషించాడని ఆరోపించారు. ఎన్‌వోసీ సర్టిఫికెట్ కోసం సంతకాలు తీసుకుంటున్నాం.. అని చెప్పకుండా.. భూమి సర్వే కోసం అని మాటలు చెప్పి ఎన్‌వోసీ కోసం చౌడూర్‌కు చెందిన రైతులు రామకృష్ణగౌడ్, శ్రీను, లక్ష్మయ్య సంతకాలను తెల్లకాగితంపై తీసుకున్నారని తెలిపారు. అలాగే ఎంపీటీసీ గోపీకృష్ణ సంతకం చేయకపోయినా వారే ఫోర్జరీ చేసినట్లు గోపీకృష్ణతోపాటు రైతులు తాసీల్దార్ ముందు వాపోయారు. ఇప్పుడు క్రషర్‌ను బంద్ చేయాలని జిల్లా అధికారుల వద్దకు వెళ్తే.. ఎన్‌వోసీ రద్దు చేస్తే క్రషర్ నిలిపివేస్తామని వారు చెబుతున్నారన్నారు. కాలుష్య కారకంగా మారనున్న క్రషర్ మిషన్‌ను నిలిపి వేయకపోతే తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం తన సంతకం ఫోర్జరీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీటీసీ గోపీకృష్ణ నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వెంటనే పనులు నిలిపి వేయాలని కోరారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మల్లికార్జునరావు మాట్లాడుతూ రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తాసీల్దార్‌ను కలిసిన వారిలో రైతులు చిన్నయ్య, ఆంజనేయులు, నర్సింహులు, సాయిలు, సుదర్శన్, మల్లేశ్, భీమయ్య, జిలానీ, రామకృష్ణ, లక్ష్మయ్య, జహంగీర్, చిర్ప నర్సింహులు, శివకుమార్, శ్రీను తదితరులు ఉన్నారు.

## ఆవు దూడపై చిరుత దాడి

ఖిల్లాఘణపురం, జనవరి 24 : ఆవుదూడలపై చిరుత పులి దాడి చేసి చంపేసిన ఘటన మండలంలోని మానాజీపేట, షాపూర్ గ్రామాల్లో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు.. కొద్ది రోజులుగా గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తుండగా.. బుధవారం ఆవుదూడపై దాడిచేసి చంపివేసిందని చెప్పారు. చిరుతపులి సంచారంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని జీవిస్తున్నామని, అటవీశాఖ అధికారులు దానిని బంధించి రక్షణ కల్పించాలని కోరారు.

## నిధులు దుర్వినియోగం చేసిన ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్, జనవరి 24 : నాగర్‌కర్నూల్ జిల్లాలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఇద్దరు ఉద్యోగులను కలెక్టర్ ఉదయ్‌కుమార్ సస్పెండ్ చేశారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ నిధులను ఫేక్ ఏజెన్సీలను సృష్టించి సొంత అకౌంట్లలోకి మళ్లించి దుర్వినియోగానికి పాల్పడిన సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఓఎస్ విష్ణుపై కేసు నమోదు చేసి సం బంధిత అకౌంట్లను సీజ్ చేసినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్ బుధవారం తెలిపారు.

ఇద్దరు ఉద్యోగులపై విచారణకు ప్రత్యేక అధికారిని నియమించామని, మళ్లించిన నిధులను రికవరీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

# కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దు

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ
- రైతుకు కోడెలను అందించి మానవత్వం చాటుకున్న వైనం



పెద్దగూడెంలో పార్టీ కార్యకర్త తల్లికి బీమా చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జనవరి 24 : జిల్లా ప్రజలకు ఏ ఆపద వచ్చినా వెంటనే ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభయం ఇచ్చారు. బుధవారం మండలంలోని పెద్దగూడెంలో మృతి చెందిన పార్టీ కార్యకర్త సాయికుమార్ తల్లి వెంకటమ్మకు పార్టీ బీమా రూ.2 లక్షల చెక్కును నిరంజన్‌రెడ్డి అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు ఎద్దులు కొన్ని రోజుల కిందట గున్నం చెరువులో ప్రమాదవశాత్తు మునిగి చనిపోయిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రెండు కోడెలను అందించి మానవత్వం చాటుకున్నారు. ప్రతి దానిని డబ్బులతో ముడిపెడితే తీరే బాధ కాదని, తాను ఎంతో ప్రేమగా పెంచుకున్న జీవాలు అకస్మాత్తుగా చనిపోవడం చాలా బాధాకరంగా ఉంటుందని, దానికి డబ్బులు ఇస్తే సరిపోదన్న ఉద్దేశంతో తన వద్దనున్న రెండు కోడెలను అందించినట్లు చెప్పారు. అదేవిధంగా పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వడ్డె రమేశ్‌కు ఇటీవల జరిగిన ప్రమాదంలో చెయ్యి విరగగా.. నిరంజన్‌రెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఏ చిన్న విషయమైనా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, సర్పంచ్ కొండన్న, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అశోక్, బుచ్చిబాబు, వార్డు సభ్యుడు భాస్కర్‌గౌడ్, మీడియా కన్వీనర్ అశోక్‌కుమార్, దేవేందర్, మాధవరెడ్డి, విజయ్‌కుమార్, తిరుమలయ్య, బాలస్వామి, లక్ష్మీకాంత్‌రెడ్డి, సునీల్ ఉన్నారు.

***మృతుడి కుటుంబానికి పరామర్శ***

పెబ్బేరు, జనవరి 24 : పెబ్బేరులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వరుణ్‌యాదవ్ కుటుంబాన్ని బుధవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, పార్టీ మండలాధ్యక్షుడు రాములు, నాయకులు ఎల్లయ్య, చిన్న ఎల్లారెడ్డి ఉన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ, జనవరి 24 : ధన్వాడ మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన శ్రీను, గోపి జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. వీరు నేటి నుంచి 28వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో నిర్వహించే 36వ జాతీయ స్థాయి బాలబాలికల నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన శ్రీను, గోపి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై వైస్ ప్రిన్సిపాల్ సురేశ్‌రావు, నాగమణి, పీఈటీ సుగుణాకర్, పీడీ, కోచ్ రామోహ్మన్‌గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



అలంపూర్ చౌరస్తా నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

# తాగునీటికి తండ్లాట

- అలంపూర్ ఫైర్‌స్టేషన్‌లో కనీస సౌకర్యాలు కరువు
- బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న సిబ్బంది
- చీకట్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీత
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అలంపూర్, జనవరి 24 : అలంపూర్ నియోజకవర్గంలో గతంలో అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేకపోవడంతో అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా చాలా వరకు ఆస్తినష్టం చేకూర్చుకున్నారు. ఎన్నో ఏండ్ల నుంచి నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరగా కేసీఆర్ ప్రభుత్వం కొత్తగా ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసింది. కానీ ఆ ఫైర్‌స్టేషన్ ఏర్పడిన సంతోషం ఎక్కువ రోజులు ఉండేలా కనిపించడం లేదు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండు నెలల కిందట తాత్కాలికంగా ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కానీ అక్కడ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డులో ఫైర్ ఇంజన్ నిలుపుకోవడానికి తగినంత స్థలం ఉన్నప్పటికీ, సిబ్బందికి మాత్రం తగినంత గదుల సౌకర్యం లేదు. మూత్రశాలలు మరుగుదొడ్లు లేవు, బహిర్భూమికి వెళ్లాలన్నా, కనీసం గొంతు తడుపుకుందామన్నా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఒక బిందె నీరు కూడా దొరకని పరిస్థితి. రాత్రి అయితే విద్యుత్ దీపాల ఏర్పాటు లేక చీకట్లో బిక్కు బిక్కుమంటూ ఫైర్ సిబ్బంది భోగి మంటలు వేసుకొని కాలం వెల్లదీస్తున్నారు. దినచర్యల కోసం చౌరస్తా కూడలిలోని ఆయా వ్యాపార సముదాయాల వద్ద గ్రామ పంచాయతీ కుళాయిల నీటి కోసం పడిగాపులు గాయాల్సి వస్తుందని ఫైర్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్నిమాపక కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే ఫైర్ సిబ్బంది దినచర్యలు, అవసరాలకు బిందె నీరు దొరకకపోతే అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పరిస్థితి ఏంటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వం పేరుకు మాత్రమే ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకుంటుందని చర్చించుకుంటున్నారు. కనీస వసతులు లేని కారణంగా స్థానికంగా విధులు నిర్వహించడానికి సిబ్బంది ఆసక్తి చూపడం లేదు. అధికారులు స్పందించి ఫైర్ సిబ్బందికి సౌకర్యాలు మెరుగుపర్చకపోతే చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్ మరో ప్రాంతానికి తరలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఫైర్‌స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




అలంపూర్ ఫైర్‌స్టేషన్